శాసనసభలో బోనాలు

- మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి హాజరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ శాసనసభా ప్రాంగణంలో బంగారు మైసమ్మ బోనాలకు శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి హాజరయ్యారు. పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గుత్తా సకాలంలో వానలు కురిసి రాష్ట్రం పచ్చగా ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలనీ, కెసిఆర్ మూడోసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని అమ్మ వారిని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాష్, విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి, ఎంపి బడుగుల లింగయ్య యాదవ్, మండలి విప్ ఎంఎస్ ప్రభాకర్‌రావు, ఎమ్మెల్యేలు పద్మ దేవేందర్‌రెడ్డి, రేఖానాయక్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, కాలే యాదయ్య, సుంకే రవి శంకర్, ఎమ్మెల్సీలు యాదవరెడ్డి, వాణిదేవి, మాజీ ఎమ్మెల్సీ విజి గౌడ్, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి నరసింహాచార్యులు, బిఆర్‌ఎస్‌ఎల్‌పి కార్యదర్శి ఎల్పీ రమేష్ రెడ్డి, శాసన మండలి, శాసన సభ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



వేదాంతకు భారీ షాక్

- టాటాతో ఫాక్స్‌కాన్ జట్టు..!

న్యూఢిల్లీ : కార్పొరేట్ దిగ్గజం అనిల్ అగర్వాల్‌కు తైవాన్‌కు చెందిన ఫాక్స్‌కాన్ భారీ షాక్ ఇచ్చింది. భారత్‌లో చిప్‌ల తయారీకి వేదాంతతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకోగా.. తాజాగా టాటా గ్రూపునతో కలిసి ముందుకు సాగాలని భావిస్తోన్నట్లు సమాచారం. ఇందుకోసం టాటా గ్రూపునతో సంయుక్త భాగస్వామ్యం కోసం చర్చలు జరుపుతోందని రిపోర్టులు వస్తోన్నాయి. మరో రెండు కంపెనీలతోనూ చర్చిస్తున్నట్లు సమాచారం. భారత్ ఒక బలమైన సెమీకండక్టర్ తయారీ పర్యావరణ వ్యవస్థను విజయవంతంగా స్థాపించాలని చూస్తోన్నామని ఫాక్స్‌కాన్ తెలిపింది. సరైన భాగస్వాముల కోసం సమీక్షిస్తున్నామని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొంది. దేశీయ, అంతర్జాతీయ వాటాదారులను స్వాగతించడానికి సిద్దంగా ఉన్నట్లు తెలిపింది. గుజరాత్‌లో రూ.1.5 లక్షల కోట్ల పెట్టుబడితో ఈ ప్లాంట్ ఏర్పాటుకు గతేడాది వేదాంతో ఒప్పందం కుదుర్చుకుంది. తాజాగా పరస్పర ఆలోచనలతోనే ఈ ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. సరైన భాగస్వామి దొరక్కపోతే సొంతగానే ప్లాంట్ పెట్టాలనే యోచనలో ఉన్నట్లు రిపోర్ట్‌లు వస్తోన్నాయి.



అదాని గ్రూపుపై ఆగస్టులో విచారణ

న్యూఢిల్లీ : అదాని గ్రూపు కంపెనీలు తీవ్ర ఆర్థిక అవకతవకల ఆరోపణలపై సెబీ సమర్పించిన రిపోర్ట్‌పై ఆగస్ట్‌లో విచారణ జరపనున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది. అదాని కంపెనీలు మోసాలకు పాల్పడుతున్నాయనే హిండెన్‌బర్గ్ రిపోర్ట్‌పై సెబీ విచారణ జరిపి 41 పేజీలతో కూడిన నివేదికను సోమవారం అత్యున్నత న్యాయస్థానానికి అందించింది. దీనిపై ఇంకా విచారణ జరుగుతుందని.. కొంత సమయం ఇవ్వాలని సెబీ కోరడంతో న్యాయస్థానం మంగళవారం అంగీకరించింది. ఈ కేసును ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచుడ్ ధర్మాసనం విచారిస్తూ.. ఆగస్టు 14 వరకు పూర్తి విచారణ రిపోర్ట్‌కు గడువు ఇచ్చింది. నికర ఆస్తులతో సంబంధం లేకుండా అదాని గ్రూపు కంపెనీల షేర్లు కృత్రిమ పద్దతిలో భారీగా పెంచుతున్నారనే హిండెన్‌బర్గ్ రిపోర్ట్‌తో ఇన్వెస్టర్లు లక్షల కోట్లు నష్టపోయిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ జరపాలని.. ఇన్వెస్టర్ల ఆసక్తులను కాపాడాలని సెబీని సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే.

పంచాయతీ కార్యదర్శుల రెగ్యులరైజేషన్

- విఆర్ఏలను ఇరిగేషన్, ఇతర శాఖల్లో సర్దుబాటు
- నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలి
- సిఎస్‌ను ఆదేశించిన సిఎం కెసిఆర్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాలుగు సంవత్సరాల శిక్షణా కాలాన్ని పూర్తి చేసుకున్న పంచాయతీ కార్యదర్శుల సర్వీసును నిర్దేశించిన నిబంధనల మేరకు పరిశీలించి క్రమబద్ధీకరించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు నిర్ణయించారు. ఇప్పటికే జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన కమిటీల పరిశీలనలో నిర్ధేశించిన లక్ష్యాలను మూడింట రెండు వంతులు చేరుకున్న వారికి రెగ్యులరైజ్ చేయాలని సిఎం నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన చర్యలు ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని, పంచాయతీ రాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ సుల్తానియా, కమిషనర్ హన్మంతరావులను సిఎం కెసిఆర్ ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణ, విఆర్ఎల సర్దుబాటు ఇతర అంశాలపై సిఎం మంగళవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. తెలంగాణ వ్యాప్తంగా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర అభినందనీయమని ముఖ్యమంత్రి తెలిపారు.

దేశవ్యాప్తంగా వున్న గ్రామాలతో పోటీపడి తెలంగాణ పల్లెలు సాధించిన జాతీయ అవార్డుల్లో వారి కృషి ఇమిడివున్నదన్నారు. సాధించిన దానితో సంతృప్తిని చెంది అలసత్వం వహించకూడదని, తెలంగాణ పల్లెలు మరింతగా గుణాత్మక మార్పు చెంది, ప్రజల భాగస్వామ్యంతో మరింత అభివృద్ధి చెందే దిశగా పంచాయితీ కార్యదర్శుల నిరంతర కృషి కొనసాగుతూనే వుండాలని సిఎం ఆకాంక్షించారు.

విఆర్ఎల అభిప్రాయం మేరకు చర్యలు

రాష్ట్రంలో పనిచేస్తున్న విఆర్ఎ (విలేజ్ రెవిన్యూ అసిస్టెంట్) లను, వారి వారి విద్యార్హతలను, సామర్థ్యాలను అనుసరించి ఇరిగేషన్ సహా ఇతర శాఖల్లో సర్దుబాటు చేసి వారి సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో విఆర్ఎలతో సమావేశమై, చర్చించి వారి అభిప్రాయాలను సేకరించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సిఎం అన్నారు. ఇందుకు గాను, మంత్రి కె.టి.రామారావు గారి ఆధ్వర్యంలో మంత్రులు జి.జగదీశ్ రెడ్డి, సత్యవతి రాథోడ్ లతో కూడిన మంత్రి వర్గ ఉప సంఘాన్ని సిఎం కెసిఆర్ ఏర్పాటు చేశారు. సిఎం ఆదేశాల మేరకు మంత్రి వర్గ ఉప సంఘం విఆర్ఎలతో బుధవారం నుంచి చర్చలు ప్రారంభించనున్నది. చర్చల అనంతరం ఉప సంఘం సూచనల ప్రకారం నిర్ణయాలు తీసుకోని విఆర్ఎల సేవలను వినియోగించుకునే దిశగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని సిఎం ఆదేశించారు. ఇందుకు సంబంధించిన ఉప సంఘం కసరత్తు పూర్తయి తుది నివేదిక సిద్ధమైన తర్వాత మరోమారు చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ మొత్తం ప్రక్రియ వారం లోపు పూర్తి కావాలని ఆదేశించారు.

ఆర్‌టిసి కార్మికుల సమస్యలపై
దశలవారీగా పోరాటాలు

- 12న కలెక్టర్లకు వినతులు, 16న రౌండ్‌టేబుల్ సమావేశం
- టిఎస్ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్‌టిసి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జెఎసి ఆధ్వర్యంలో దశలవారీగా పోరాటాలు చేయనున్నట్టు టిఎస్‌ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి ప్రకటించారు. ఈ నెల 12న కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు. 16న రాజకీయ పార్టీలు, ట్రేడ్ యూనియన్ల నేతలతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఆర్‌టిసిలో ఎన్నికలు నిర్వహించాలని 22న నిరసన తెలుపుతామన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని టిఎస్‌ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో ఆ యూనియన్ హైదరాబాద్ రీజినల్ మహాసభలను బి.పాపయ్య గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. రాజిరెడ్డి మాట్లాడుతూ.. కొందరు ఇన్నేండ్లు కుంభకర్ణుని నిద్రలో ఉండి మేలుకొని రమ్మనగానే జేఏసీ మూసుకుని పోవాల్సిన అవసరం లేదని నొక్కి చెప్పారు. మిగతా సంఘాలన్నీ జేఏసీతో కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్మికులపై యాజమాన్యం వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఎమ్‌టీడబ్ల్యూ చట్టం ప్రకారం డ్యూటీ షెడ్యూల్ ఉండాలని కోరారు. ఆర్‌టిసిలో వెంటనే గుర్తింపు సంఘం ఎన్నికలు పెట్టాలనీ, వేతన సవరణలు చేయాలని డిమాండ్ చేశారు. వీఎస్ బోస్ మాట్లాడుతూ..ఆర్‌టిసి కొనుగోలు చేసే విద్యుత్ బస్సులపై 90 శాతం సబ్సిడీ ఇవ్వాలన్నారు. వాటిని కార్పొరేట్ శక్తులకు ఇవ్వొద్దని డిమాండ్ చేశారు. ఆర్‌టిసిలను నిర్వీర్యం చేసేలా టూరిస్ట్ పర్మిట్ గైడ్ లైన్స్‌లో విద్యుత్ బస్సులకు ఫీజు లేకుండా పర్మిట్ ఇచ్చే నిబంధనలు రద్దు చేయాలని కోరారు. ప్రయివేట్ బస్సుల అక్రమ రవాణాని అరికట్టాలని డిమాండ్ చేశారు.

ఉచిత విద్యుత్తు రద్దుకు కాంగ్రెస్ కుట్రలు

- ఆ పార్టీ దుష్ట విధానాలకు రేవంత్ వ్యాఖ్యలే నిదర్శనం
- మంత్రి కెటిఆర్ ఆగ్రహం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'ఉచిత విద్యుత్తుకు ఉరి వేసేందుకు గాంధీభవన్ కేంద్రంగా జరుగుతున్న కాంగ్రెస్ కుట్రలను తిప్పికొట్టాలి. 24 గంటల ఉచిత కరెంట్ రద్దు చేసి మూడు గంటల కరెంట్ మాత్రమే ఇస్తామని చెప్పడం కాంగ్రెస్ దుష్ట విధానాలకు పరాకాష్ట. రైతుకు ఉచిత విద్యుత్తు ఊపిరిలాంటిది.. రైతుల ఊపిరిని ఆపేస్తామని, అన్నదాత ఉసురు తీస్తామని చెప్పడం ఆ పార్టీ రాక్షస బుద్ధికి తార్కాణం. కాంగ్రెస్ కాలంలో తెలంగాణ రైతులు పడ్డ కష్టాలు..అనుభవించిన బాధలను తెలంగాణ ఎన్నటికి మర్చిపోదు. ఆ కాలంలో కరువులు, కన్నీళ్లు, కటిక చీకట్లు, అప్పులు, ఆత్మహత్యలతో అన్నదాతలు అరిగోస పడ్డారు. ఉచిత విద్యుత్తును ఎత్తివేసి మోటర్లుకు మీటర్లు పెట్టాలని రాష్ట్రం మెడపైన కేంద్రం కత్తిపెట్టినా ప్రభుత్వం లొంగిపోలేదు. 24 గంటల ఉచిత కరెంట్‌ను కాపాడుకోవడానికి ఏకంగా రూ.30వేల కోట్ల వదులుకున్నది తప్ప రైతుల ప్రయోజనాలపై రాజీపడలేదు. ఈ 24 గంటల ఉచిత విద్యుత్తు వెలుగులను వదులుకుందామా? కటిక కాంగ్రెస్ చీకట్ల కాలాన్ని మళ్లీ తెచ్చుకుందామా? చైతన్యవంతమైన తెలంగాణ రైతులు



ఆలోచించుకోవాలి' అని మంత్రి కెటిఆర్ అన్నారు. టిపిసిసి చీఫ్ రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై ఆయన ఘాటు విమర్శలు గుప్పించారు.

వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అవసరం లేదని కాంగ్రెస్ చేసిన ప్రకటన ఆ పార్టీ రైతు వ్యతిరేక వైఖరికి నిదర్శనమన్నారు. నిన్నటిదాకా ధరణి రద్దు.. రైతుబంధు వద్దూ అంటూ ఇప్పటికే రైతు వ్యతిరేక విధానాలను ప్రకటిస్తున్న కాంగ్రెస్, ఇప్పుడు ఏకంగా ఫ్రీ కరెంట్‌ను ఎత్తేస్తామన్న తన క్రూరమైన ఆలోచనను బయటపెట్టుకుందని తెలిపారు. ఆనాడు విద్యుత్ కోతలతో చాలీచాలని మూడు గంటల నాసిరకం కరెంట్‌తో రైతులు నరకం అనుభవించారని వాపోయారు. నాడు కాంగ్రెస్ హయాంలో ఎరువుల్ని పోలీస్ స్టేషన్లలో పెట్టి అమ్మే దుస్థితి ఉండేదని, కిలోమీటర్ల దూరం క్యూలైన్లలో చెప్పులు, లాఠీచార్జీల దృశ్యాలే కాంగ్రెస్ పాలనా పాడు కాలంలో ఉండేవని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ కల్తీ పాలనలో రైతులకు దొరికింది కల్తీ విత్తనాలు, కల్తీ పురుగు మందులేనని విమర్శించారు.

జిపి కార్మికులకు బెదిరింపులు

- సమ్మె విచ్ఛిన్నానికి కుట్ర
- దినసరి కూలీలతో పారిశుధ్య పనులు చేయించేందుకు యత్నం
- అడ్డుకున్న కార్మికులు.. కొనసాగుతున్న సమ్మె

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికుల(జిపి) పై అధికారులు బెదిరింపులకు దిగుతున్నారు. విధుల్లో చేరకుంటే కొత్తవారిని తీసుకుంటామంటూ హెచ్చరిస్తూ దినసరి కూలీలతో పనులు చేయించేందుకు యత్నించారు. కార్మికులు అడ్డుకోవడంతో వెనక్కి తగ్గారు. తమ గోడును వినాలంటూ అంబేద్కర్ విగ్రహాలకు వినతులు అందించారు.

ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండల కేంద్రంలో కొనసాగుతున్న జిపి కార్మికుల సమ్మెకు అడ్డంకులు ఏర్పడ్డాయి. మంగళవారం బెజ్జూర్ గ్రామ ఉపసర్పంచ్, కార్యదర్శి కలిసి దినసరి కూలీలతో పారిశుధ్య పనులు చేయించారు. విషయం తెలుసుకున్న గ్రామ పంచాయతీ కార్మికులు అడ్డుకోవడంతో పోలీసులను రప్పించి పనులు చేయించారు.


ఖమ్మం జిల్లా బోనకల్ మండల కేంద్రంలో జిపి కార్మికులు కండ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. తల్లాడలో కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ సంఘీభావం తెలిపారు. అనంతరం కార్మికులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.



పంచాయతీ కార్మికులను అడ్డుకుంటున్న పోలీసులు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ పర్యటన నేపథ్యంలో నరసాపురం, రెడ్డిపాలెం, లక్ష్మీపురం గ్రామాల నుంచి కార్మికులను రప్పించి పోలీస్ బలగాల పహరా మధ్య పారిశుధ్య పనులు చేయించే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న గ్రామపంచాయతీ కార్మికులు, సిఐటియు నాయకులు ఎంబి నర్సారెడ్డి, మర్లపాటి రేణుక, నాగరాజు, లక్ష్మణ్, ఎఐటియుసి నాయకులు పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు పంచాయతీ కార్మికుల మధ్య కొంతసేపు వాగ్వాదం, తోపులాట జరిగింది. నాయకులను అరెస్టు చేసేందుకు ప్రయత్నించగా కార్మికులు పోలీసులను చుట్టుముట్టడంతో వెనక్కి తగ్గారు. తమపై గ్రామపంచాయతీ ఇఒ కావాలనే కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు.

యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో జిపి కార్మికుల సమ్మె శిబిరాన్ని జిపి ఉద్యోగ, కార్మిక సంఘాల జిల్లా జేఏసీ చైర్మన్ దాసరి పాండు సందర్శించి మాట్లాడారు. జెడ్పీ కార్యాలయం ఎదుట కార్మికులు రోడ్లు ఊడ్చుతూ నిరసన తెలిపారు. నల్లగొండ జిల్లా చండూరు, మర్రిగూడ మండలాల్లో సమ్మె శిబిరాలను సిఐటియు జిల్లా అధ్యక్షులు చిన్నపాక లక్ష్మీనారాయణ సందర్శించారు. సూర్యాపేట జిల్లా కోదాడరూరల్ మండలంలో జిపి కార్మికుల సమ్మెకు సిఐటియు రాష్ట్ర నాయకులు సోమపంగు రాధాకృష్ణ మద్దతు తెలిపారు. బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న డాక్టర్ బీఆర్.అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. హుజూర్‌నగరకు వచ్చిన అదనపు కలెక్టర్ మోహన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. పెన్‌పహాడ్‌లో జీపీ కార్మికుల సమ్మెకు కాంగ్రెస్ ఎంపిటిసి సభ్యులు గద్దల నాగరాజు సంఘీభావం తెలపడంతోపాటు రూ.1000 అందజేశారు.



ట్యాంక్ బండ్ వద్ద నిరసన తెలుపుతున్న ఐప్సో నాయకులు

నాటో అవసరం లేదు

- ఐప్సో జాతీయ అధ్యక్షులు సుధాకర్
- ఐప్సో రాష్ట్ర కౌన్సిల్ ఆధ్వర్యంలో ట్యాంక్ బండ్ యుద్ధ ట్యాంకర్ వద్ద నిరసన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దేశాల మధ్యన అస్థిరత.. ఉద్రిక్తత వాతావరణాన్ని సృష్టిస్తూ, ఆయుధ వ్యాపారాన్ని కొనసాగిస్తూ, మారణ హోమాన్ని సృష్టించే నాటో ప్రపంచానికి ఎట్టి పరిస్థితుల్లో అవసరం లేదని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఐప్సో) జాతీయ అధ్యక్షులు డాక్టర్ డి.సుధాకర్ అన్నారు. నాటో (నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్) సమ్మిట్‌ను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని ఐప్సో రాష్ట్ర కౌన్సిల్ ఆధ్వర్యంలో మంగళవారం ట్యాంక్ బండ్ యుద్ధ ట్యాంకర్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ.. ప్రపంచంలో తన ఆధిపత్యాన్ని చూపించుకోవడానికి, ఆసియా పసిఫిక్ ప్రాంతాల్లో విస్తరించడానికి కుట్రలను యుద్ధ తంత్రాలు చేయడానికి లుధ్వేనియా, విల్నియస్ జరుగుతున్న నాటో సమ్మిట్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు.

ఐప్సో రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్ మాట్లాడుతూ.. ఈ భూమి మీద నాటోకు అవకాశం ఇవ్వొద్దన్నారు. 1949 సంవత్సరంలో అమెరికా కీలుబొమ్మ సంస్థగా ఏర్పడిన నాటోలో నాడు 11 దేశాలు మాత్రమే ఉండేవని తెలిపారు.

ఇప్పుడు 31 దేశాల్లో విస్తరించి యుద్ధ కోరలతో కాటేస్తున్నదన్నారు. సామ్రాజ్యవాదం సైనిక కూటమిగా బలపడాలని చూస్తున్న నాటోకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పిడికిలి బిగించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రపంచ శాంతికి నాటో పెద్ద ప్రమాదమని, ప్రమాదకర శక్తులను తరిమి వేయాలని అన్నారు. జి.రఘుపాల్ మాట్లాడుతూ.. ప్రపంచ శాంతి గురించి ఆలోచించే అన్ని రంగాల ప్రజలు ఐక్యమై బలమైన పోరాటాలు చేయాలన్నారు. ఐప్సో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంచం సత్యనారాయణ, అధ్యక్షవర్గ సభ్యులు తిప్పర్తి యాదయ్యలు మాట్లాడుతూ.. ప్రపంచ శాంతికి ప్రతి ఒక్కరూ చేయ్యి కలపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐప్సో నాయకులు ఉమా మహేష్, వెంకటేష్ గౌడ్, రామ్ నారాయణ, డీజి నరేంద్ర ప్రసాద్, పోల గాని రవి కిషోర్, తిప్పర్తి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బిజెపికి బి టీమ్ కాంగ్రెస్సే


- రవాణా శాఖ మంత్రి పువ్వాడ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిజెపికి బి టీమ్ కాంగ్రెస్సు అని ప్రజలు గ్రహిస్తున్నారని, బిజెపికి అనుకూలంగా బిఆర్‌ఎస్ కలిస్తే తాను మంత్రి పదవికి రాజీనామా చేస్తానని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. ఉమ్మడి పౌరస్మృతి విషయంలో సిఎం కెసిఆర్ తీసుకున్న నిర్ణయాన్ని తాము స్వాగతిస్తూ ధన్యవాదాలు తెలుపుతున్నామని చెప్పారు. ఖమ్మంలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. విభజించి పాలించడం, అన్ని వర్గాలకు అన్యాయం చేయడం అనే బిజెపి విధానానికి తాము వ్యతిరేకమన్నారు.

ఒప్పో నుంచి రెనో 10 5జి సిరీస్

న్యూఢిల్లీ : ప్రముఖ స్మార్ట్‌ఫోన్ తయారీదారు ఒప్పో కొత్తగా రెనో 10 5జి సీరిస్‌ను విడుదల చేసింది. 6.7 అంగుళాల డిస్‌ప్లే



కలిగిన ఈ ఫోన్‌ను ట్రిపుల్ రేర్ కెమెరాలతో తెచ్చింది. ఇందులో టాప్ వేరియంట్ రెనో 10 ప్రో ధరను రూ.594999గా నిర్ణయించింది. జులై 11నుంచి ఇది ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో లభించనుందని పేర్కొంది. 64ఎంపి ఒవి64బి సెన్సార్ కెమెరాతో దీన్ని విడుదల చేసినట్లు తెలిపింది.



మిగులు భూములను పేదలకు ఎందుకు పంచరు?

- ప్రభుత్వాలకు పెట్టుబడిదారుల ప్రయోజనాలే లక్ష్యం
- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు రాఘవులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సామాన్య ప్రజల ప్రయోజనాల కంటే పెట్టుబడిదారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బిల్డర్ల వ్యాపార ప్రయోజనాలే ప్రధాన అజెండాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు విమర్శించారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం "పట్టణ స్థానిక సంస్థల సంస్కరణలు, కేంద్ర ప్రభుత్వ తాజా ఆదేశాలపై" చర్చాగోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ.. నగర అభివృద్ధి, ప్రణాళికలు అన్నింటికీ ప్రజల అవసరాల కోసం కాకుండా ఎన్నికల అవసరాలను బట్టి నిధులు విడుదలవుతున్నట్టు చెప్పారు. దేశవ్యాప్తంగా ఉన్న నగరాల్లోని సివరేజీ నిర్వహణ, మంచినీటి సరఫరా వ్యవస్థను ప్రయివేటు వ్యక్తులకు అప్పజెప్పే కుట్రలు సాగుతున్నాయన్నారు. రాష్ట్రంలో భూముల రేట్లు పెరిగాయని గొప్పలు చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం.. మిగులు భూములను పేదలకు ఎందుకు పంచడం లేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించే పద్ధతుల్లో పట్టణ ప్రణాళికల్లో సంస్కరణలు, మున్సిపాల్టీల్లో ఆర్థిక సంస్కరణ అమలు చేసే నగరాలకే నిధులు ఇస్తామని ప్రకటించడం అప్రజాస్వామికమన్నారు. సిపిఎం సెంట్రల్ సిటీ కమిటీ సెక్రటరీ ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ.. నగరాల అభివృద్ధి కోసం సరైన పద్ధతుల్లో సామాన్య ప్రజలకు ఉపయోగపడే విధంగా నిధుల కేటాయింపులు జరగాలన్నారు. అర్బన్ పాలసీ విశ్లేషకులు డాక్టర్ డి.నరసింహారెడ్డి నగరాభివృద్ధి ప్రణాళికలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.దశరథ్, మహేందర్, శ్రీనివాసరావు, నగర కమిటీ సభ్యులు మారన్న, జి.నరేష్, నాయకులు శ్రీరాములు, అజయ్ బాబు, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి ఎండీ జావిద్ తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెండింగ్ బిల్లులు చెల్లించాలని, సమస్యలు పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ మధ్నాహ్న భోజన కార్మికులు ధర్నా చేపట్టారు..తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్ పట్టణంలోని ఎంఇఒ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. వీరికి సిఐటియు జిల్లా కమిటీ నాయకులు కురమయ్య మద్దతు తెలిపారు. ఇబ్రహీంపట్నం తహశీల్దార్ కార్యాలయం ఎదుట రెండో రోజు దీక్షలు కొనసాగాయి. మధ్యాహ్న భోజన పథకం యూనియన్ జిల్లా కార్యదర్శి ఏలమోని స్వప్న, తదితరులు పాల్గొన్నారు. యాచారం తహశీల్దార్ కార్యాలయంలో చేపట్టిన దీక్షలకు సిఐటియు నాయకులు మద్దతు తెలిపారు. వరంగల్ జిల్లా డిఇఒ ఆఫీస్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా నిర్వహించారు. హన్మకొండ జిల్లాలో జిల్లా అధ్యక్షులు ధర్ముల రామ్మూర్తి ఆధ్వర్యంలో డిఇఒ ఆఫీసు ఎదుట ధర్నా చేపట్టారు. కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు.



ఎస్‌టి యువత విజయగాథల పుస్తకం విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎస్‌టిలలో వ్యవస్థాపకత ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ముఖ్యమంత్రి కెసిఆర్ సృజనాత్మక పథకం.. 'చీఫ్ మినిస్టర్స్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ ఎంటర్ ప్రెన్యూర్షిప్ అండ్ ఇన్నోవేషన్ స్కీం (సిఎంఎస్ఇఐ)' ద్వారా వివిధ రంగాలలో లబ్ధిదారులైన ఎస్‌టి యువతీ యువకుల విజయగాథలను, సాధించిన ప్రగతికి సంబంధించిన సమాచారాన్ని దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ పుస్తక రూపంలో ప్రచురించింది. ఈ పుస్తకాన్ని మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మంత్రి సత్యవతి రాథోడ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, గిరిజన శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్థూ, రాష్ట్ర గిరిజన కార్పోరేషన్ ఛైర్మన్ రమావత్ వాల్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చెరకు రైతుకు మద్దతేదీ..!

- ఐదేళ్ల కాలంలో క్వింటాల్‌కు రూ.40 పెంపు
- జహీరాబాద్‌లో ట్రైడెంట్ షుగర్ ప్యాక్టరీ మూసివేత
- రైతులకు రూ.12.05 కోట్ల బకాయిలు
- రైతులను ఆదుకోవాలి రైతు సంఘం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తీపిని పండించే చెరకు రైతుల బతుకు చేదెక్కుతోంది. రైతు వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న కేంద్ర ప్రభుత్వం చెరకుతోపాటు వివిధ పంటలకు కనీస మద్ధతు ధర కల్పించడంలో ఘోరంగా విఫలమైంది. కేంద్ర ప్రభుత్వం గడిచిన ఐదేండ్ల కాలంలో చెరకు మద్దతు ధర కేవలం క్వింటాల్‌పై రూ.40 మాత్రమే పెంచింది. ఒక పక్క పంట సాగు పెట్టుబడులు విపరీతంగా పెరుగుతున్నా.. కేంద్రం రైతుకు కనీస మద్ధతు ధర పెంచకపోవడంతో పెట్టిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితి. మరో పక్క స్థానికంగా షుగర్ ప్యాక్టరీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ రైతుల్ని దోపిడి చేస్తున్నాయి.

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా సంగారెడ్డి జిల్లాలోనే రెండు షుగర్ ప్యాక్టరీలున్నాయి. జహీరాబాద్‌లోని ట్రైడెంట్ షుగర్ ఫ్యాక్టరీ జోన్ పరిధిలో జహీరాబాద్, న్యాల్‌కల్, ఝరాసంఘం, కోహీర్, రాయికోడ్, మొగుడంపల్లి ప్రాంతాల్లో 8568 మంది రైతులు, 7159.60 మెట్రిక్ టన్నుల చెరకును దిగుబడి చేస్తున్నారు. సంగారెడ్డిలోని గణపతి షుగర్ ప్యాక్టరీ జోన్ పరిధిలో సంగారెడ్డి, సదాశివపేట, కంది, కొండాపూర్, మునిపల్లి, వట్‌పల్లి, చౌటకూర్, హత్నూర ప్రాంతాల్లో 5600 మంది రైతులు.. 5680.20 మెట్రిక్ టన్నుల చెరకు దిగుబడి చేస్తున్నారు. మొత్తంగా ఈ రెండు ప్యాక్టరీల పరిధిలో సుమారు 14 వేల మంది రైతులు చెరకు సాగు చేస్తున్నారు. ప్రతి ఏటా నవంబర్ మాసంలో క్రషింగ్ చేస్తారు. చెరకు సాగు చేసేందుకు షుగర్ ప్యాక్టరీలు ముందే రైతులతో ఒప్పందం చేసుకుని క్రషింగ్ చేస్తారు.

పెరిగిన ఖర్చులు.. పెరగని మద్ధతు ధర

కేంద్రం విధానాలతో ముడిసరుకు, ఎరువుల ధరలు విపరీతంగా పెరిగాయి. డీజిల్ ధరలు పెరిగాయి. దాంతో పంట సాగు పెట్టుబడులూ పెరిగాయి. ఖర్చుకు తగ్గట్టుగా చెరకుకు మద్ధతు ధర మాత్రం పెరగడం లేదు. కేంద్రం ప్రకటిస్తున్న కనీస మద్ధతు ధర నామమాత్రంగా పెంపుదల ఉంటుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కేంద్రం ఈ ఐదేండ్ల కాలంలో చెరకుపై ప్రకటించిన ఎఫ్‌ఆర్పీని పరిశీలిస్తే ఐదేండ్ల క్రితం క్వింటాల్ చెరకు ధర రూ.275 ఉండగా.. అంటే టన్ను ధర రూ.2750 ఉండేది. ఇటీవల ప్రకటించిన క్వింటాల్ ధర రూ.315 ఉంది. అంటే టన్ను ధర రూ.3150 మాత్రమే రైతుకు వస్తుంది. ఇలా ఐదేండ్లలో చెరకు పంటకు క్వింటాల్‌కు రూ.40 మాత్రమే కనీస మద్ధతు ధరను కేంద్రం పెంచింది. టన్ను చొప్పున చూస్తే కేవలం రూ.400 మాత్రమే ధర పెరిగింది. రైతుకు పంట సాగుకు అయ్యే ఖర్చు మాత్రం విపరీతంగా పెరిగింది. మరో పక్క స్థానికంగా షుగర్ ప్యాక్టరీ యాజమాన్యాలు చెరకు నాణ్యతను బట్టి ధరను నిర్ణయించి చెల్లిస్తాయి. వాతావరణ మార్పులు, చీడపీడల వల్ల పంట నాణ్యత లేదనే పేరుతో ధరలో కోత పెడుతున్నాయి. అటు కేంద్రం ధర పెంచకపోవడం, ఇటు షుగర్ ప్యాక్టరీలు ఇష్టానుసారంగా ధరను నిర్ణయించడం వల్ల చెరకు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

ట్రైడెంట్ షుగర్ మూసివేత

జహీరాబాద్‌లోని ట్రైడెంట్ షుగర్ ప్యాక్టరీ మూతపడింది. నెల రోజు క్రితం చెరకు క్రషింగ్ పనులు నడిచాయి. 2022-23 సంవత్సరంలో చేసిన క్రషింగ్‌కు టన్ను చెరకు రూ.3050 మద్ధతు ధర చొప్పున రైతులకు ఈ ప్యాక్టరీ యాజమాన్యం రూ.12.05 కోట్లు చెల్లించాల్సి ఉన్నా ఇప్పటికీ చెల్లించలేదు. ప్రతి సీజన్‌లో క్రసింగ్ పూర్తవ్వగానే రైతులకు ప్యాక్టరీ యాజమాన్యం డబ్బులు చెల్లిస్తుంది. తీరా డబ్బులు చెల్లించే సమయానికి ప్యాక్టరీని లాకౌట్ పేరిట మూసేయడంతో రైతులకు డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయి. అదే విధంగా ఆరు నెలలుగా అందులో పనిచేస్తున్న ఉద్యోగులకు జీతభత్యాలు కూడా చెల్లించలేదు. డబ్బులివ్వకుండా కంపెనీ మూసివేయడంతో తీవ్ర మనోవేదనకు గురైన రైతులు ఆందోళనలకు దిగారు.



కలెక్టర్‌ను కలిసి విన్నవించుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే మాణిక్యరావు, ఇతర ప్రజా ప్రతినిధులతో పాటు రైతులు మంత్రి హరీశ్‌రావును కలిసి సమస్యను వివరించారు. రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం కంపెనీ పేరిట ఉన్న 50 ఎకరాల భూమి, రూ.30 కోట్ల విలువ చేసే యంత్రాలున్నాయి. వాటిని వేలం వేసి రైతులకు డబ్బులు ఇప్పిస్తామని కలెక్టర్ ప్రకటించారు. కంపెనీ యాజమాన్యం మాత్రం జులై 15 నాటికి రైతులకు డబ్బులు చెల్లిస్తామని రాతపూర్వకంగా హామీ ఇచ్చింది. ఇంతలోపు లీగల్‌గా కోర్టును ఆశ్రయిస్తే తమ పరిస్థితి ఏమిటని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

20న జాతీయ నిరసన దినంగా ఆందోళనలు

చెరకు రైతుల పట్ల నిర్లక్షంగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వం వైఖరికి వ్యతిరేకంగా రైతులు ఈ నెల 20న దేశవ్యాప్తంగా ఆందోళనలు చేయనున్నారు. ఆలిండియా కిసాన్ సభ (ఎఐకెఎస్) అనుబంధ సంస్థ ఆలిండియా షుగర్‌కేన్ ఫార్మర్స్ ఫెడరేషన్ (ఎఐఎస్‌ఎఫ్ఎఫ్) ఆధ్వర్యంలో రైతులు దేశవ్యాప్తంగా ఉద్యమించనున్నారు. జాతీయ నిరసన దినంగా పాటిస్తూ షుగర్ ప్యాక్టరీలు, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహించనున్నారు.

చెరకు రైతులను ఆదుకోవాలి : యాదవరెడ్డి, రైతు సంఘం సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు

చెరకు పండించే రైతులను ప్రభుత్వాలు ఆదుకోవాలి. కేంద్రం ప్రకటించే ఎఫ్ఆర్పీ మద్ధతు ధర నామమాత్రంగా ఉంటుంది. కేంద్రమే కొసరి ధర ప్రకటించడం వల్ల స్థానికంగా షుగర్ ప్యాక్టరీ యాజమాన్యాలు కూడా ధరను తగ్గిస్తూ దోపిడీ చేస్తున్నాయి. ట్రైడెంట్ ప్యాక్టరీ యాజమాన్యం నుంచి రైతులకు రావాల్సిన డబ్బులను వెంటనే ఇప్పించాలి. మంత్రి, కలెక్టర్ జోక్యం చేసుకుని రైతులకు న్యాయం చేయకపోతే ఆందోళన తీవ్రతరం చేయడమే కాకుండా న్యాయపరంగా పోరాడుతాం.

సంవత్సరం	చెరకు సాగు విస్తీర్ణం	మద్ధతు ధరటన్నుకు
2017-18	11240.90	2750
2018-19	7492.10	2850
2019-20	6474.54	2950
2020-21	4971.41	క్రసింగ్‌నిలిపేశారు
2021-22	7159.60	3050
2022-23	10121.25	3150



మొబైల్ వాహనాలను ప్రారంభిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

వ్యవసాయ రంగంలో అద్భుతమైన పురోగతి

- వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి
- ఎసిఎఫ్ఐ 10 మొబైల్ వ్యాన్లు ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రం ఏర్పడిన తర్వాత వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చి అద్భుతమైన పురోగతిని సాధించిందని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆడిటోరియంలో ఎసిఎఫ్ఐ ఆధ్వర్యంలో 'జాగో కిసాన్ జాగో' అవగాహన కార్యక్రమం చేపట్టింది. ప్రచారంలో భాగంగా 10 మొబైల్ వ్యాన్‌లను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి నుండి వివిధ రంగాల్లో, మరీ ముఖ్యంగా వ్యవసాయ రంగంలో అద్భుతమైన పురోగతిని సాధించామన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ నేతృత్వంలో ప్రారంభించిన ప్రత్యేక పథకాలు, రైతు వేదికలు.. పంచాయతీ స్థాయిలో ఏకీకృత పరిష్కారంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నీటిపారుదల సౌకర్యాల విస్తరణ, చెరువుల పునరుద్ధరణ కారణంగా పత్తి, వరి విస్తీర్ణంలో గణనీయమైన పెరుగుదల సాధ్యమైందని, ఫలితంగా ఉత్పాదకత మెరుగుపడిందన్నారు. నాణ్యమైన వ్యవసాయ దిగుబడి, రైతుల ఆదాయం మెరుగుపడటానికి నాణ్యమైన వ్యవసాయ ఇన్‌పుట్స్ (ఆగ్రో కెమికల్స్) ఆవశ్యకతపై అవగాహన కల్పించడానికి ఎసిఎఫ్ఐ 10 మొబైల్ వ్యాన్లను ప్రారంభించామని తెలిపారు. అనంతరం తెలంగాణ వ్యవసాయ శాఖ ప్రధాన కార్యదర్శి రఘునందన్ రావు మాట్లాడుతూ.. ఆన్‌లైన్ లైసెన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ని వ్యవసాయ శాఖ ప్రవేశపెట్టడం వల్ల ఇన్‌పుట్‌ల రంగంలో మరింత విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయన్నారు. తెలంగాణ ఇప్పుడు వేగంగా రైస్ బౌల్ అఫ్ ఇండియాగా అభివృద్ధి చెందుతోందన్నారు. రైస్ మిల్లింగ్‌లో ఎదురయ్యే సవాళ్లను పరిష్కరించడానికి, జాప్యాలను తొలగించడానికి, సమర్థవంతమైన ప్రాసెసింగ్‌ను నిర్ధారించడానికి ప్రభుత్వం ఆధునిక, అధిక సామర్థ్యం గల రైస్ మిల్లులను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. ఎసిఎఫ్ఐ అడ్వైజరీ కమిటీ చైర్మన్, ధనుకా గ్రూప్ చైర్మన్ ఆర్‌జీ అగర్వాల్ మాట్లాడుతూ.. తెలంగాణలో ఈ మొబైల్ ఆడియో విజువల్ వ్యాన్‌లతో భారీ ప్రచారం, పురుగుమందుల సురక్షిత వినియోగంపై రైతులకు అవసరమైన శిక్షణను అందించడంలో గణనీయమైన పురోగతిని సాధించగలమన్నారు. ఈ కార్యక్రమంలో ఎసిఎఫ్ఐ ట్రెజరర్, ఇండోగల్ఫ్ క్రాప్ సైన్స్ ఎండీ సంజయ్ అగర్వాల్, ఎసిఎఫ్ఐ సెక్రటరీ డాక్టర్ కళ్యాణ్ గోస్వామి, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఓయు కాంట్రాక్టు ఉద్యోగులకు ఇపిఎఫ్

- ఉత్తర్వులు జారీ చేసిన విసి రవీందర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉస్మానియా యూనివర్సిటీలో సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్న టైం స్కేల్, కాంట్రాక్టు ఉద్యోగులందరికీ ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్) అమలు చేస్తూ ఓయూ వీసీ ఆచార్య రవీందర్ చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిర్ణయంతో సుమారు 1000 మంది జీవితాల్లో వెలుగు ప్రసరించనున్నదని ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేశారు. చాలా కాలంగా ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు చేసిన పోరాటానికి దక్కిన ఫలితం ఈ విజయమని.. ఈ సందర్భంగా ఓయూ ఎన్‌జీఓఎస్ అధ్యక్షులు జ్ఞానేశ్వర్, ఉద్యోగ సంఘాల నాయకులు శివశంకర్, నాగరాజు, విజయకుమార్ అన్నారు.

ఇద్దరు బాలురు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫిల్టర్ ఇసుక తయారీ కోసం తీసిన నీటి గుంతలో పడి ఇద్దరు బాలురు మృతిచెందారు. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండల పరిధిలోని చిన్నదర్పల్లి గ్రామ శివారు లోని సిరిమలకుచ్చ తండాలో మంగళవారం జరిగింది. ఎస్‌ఐ రవి నాయక్ తెలిపిన వివరాల ప్రకారం..తిరుమల్ తండాకు చెందిన కేతావత్ గోపి, రవి మహబూబ్‌నగర్‌లో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గోపి కొడుకు గణేష్(9), రవి కొడుకు శివ(9) పట్టణంలోని మోడ్రన్ స్కూల్లో నాలుగో తరగతి చదువుతున్నారు. బోనాల పండుగ సందర్భంగా గ్రామానికెళ్లారు. ఈ క్రమంలో ఇద్దరు బాలురులు సమీపంలోని ఫిల్టర్ ఇసుక తయారీ కోసం తీసిన గుంతలో స్నానం చేసేం దుకు వెళ్లారు. లోతు ఎక్కువగా ఉండటం..వీరికి ఈత రాకపోవడంతో మునిగి పోయి ప్రాణాలు కోల్పోయారు. రెండు కుటుంబాల వారు పిల్లల కోసం వెతుకుతూ వెళ్లగా.. నీటి గుంతల వద్ద బట్టలు చూసి అందులో వెతికారు. ఇద్దరి మృతదేహాలు బయటపడ్డాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉప్పొంగిన బొగత జలపాతం

- 50 అడుగుల ఎత్తు నుంచి జాలువారుతున్న నీటిప్రవాహం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి గ్రామ సమీపంలో దట్టమైన అటవీ ప్రాంతంలో నెలకొన్న పచ్చటి ప్రకృతి అందాల జలపాతం బొగత. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బొగత జలపాతం ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఎగువన కురుస్తున్న వర్షాలకు నీటి ప్రవాహ ఉధృతి పెరిగి 50 అడుగుల ఎత్తు నుంచి తెల్లటి పాలనురగలా జలపాతం జాలువారుతోంది. దాంతో పర్యాటకులను జలపాతం కట్టి పడేస్తుంది. ఏటా వర్షాకాలం సీజన్‌లో జలపాతాన్ని సందర్శించడానికి మూడు రాష్ట్రాల ప్రజలు సుదూర ప్రాంతాల నుంచి వస్తారు. పర్యాటకుల కోసం ఫారెస్ట్‌శాఖ ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. జలపాతంలో ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలూ చేపట్టింది.

రైతులకు 24 గంటల విద్యుత్తు!

- రేవంత్‌రెడ్డి మాటలను వక్రీకరించారు
- టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రైతులకు ఉచిత విద్యుత్తు విషయంలో టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను బిఆర్‌ఎస్ నేతలు వక్రీకరిస్తున్నారని పిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీ విమర్శించారు. రైతులకు 24 గంటల కరెంట్ ఇవ్వటమే కాంగ్రెస్ విధానమని స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పలువురు నేతలు వేర్వేరుగా విలేకర్లతో మాట్లాడారు. 24 గంటల కరెంట్ పేరుతో రైతులను కెసిఆర్ మోసం చేస్తున్నారని ఆరోపించారు. మంత్రి కెటిఆర్ రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బషీర్‌బాగ్ విద్యుత్తు కాల్పులు జరిగినప్పుడు టిడిపిలో ఉన్న కెసిఆర్ ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు. ఆనాడు టిడిపి సర్కారు విద్యుత్తు కాల్పుల్లో కెసిఆర్ భాగస్వామి అని గుర్తు చేశారు. 24 గంటల కరెంట్ వెనుక ఎంత అవినీతి జరిగిందో తమ దగ్గర ఆధారాలున్నాయని తెలిపారు. విద్యుత్ కొనుగోలు అవినీతిలో కెసిఆర్ కుటుంబం పాత్ర ఉందని ఆరోపించారు. రైస్ మిల్లర్లతో కలిసి ఆ కుటుంబం దోపిడీకి పాల్పడిందన్నారు.

ఉచిత విద్యుత్తు కాంగ్రెస్ పథకమే : మల్లురవి

ఉచిత విద్యుత్తుకు పేటెంట్ హక్కు కాంగ్రెస్‌దేనని టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి చెప్పారంటూ పార్టీ ఉపాధ్యక్షులు మల్లు రవి చెప్పారు. అమెరికాలో ఎన్‌ఆర్‌ఐల సమావేశంలో రేవంత్‌రెడ్డిని అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఉచిత విద్యుత్తు గురించి మాట్లాడారని తెలిపారు. విద్యుత్తు కొనుగోళ్లలో జరిగిన అక్రమాలపై ఆయన మాట్లాడారని చెప్పారు. అక్కడ విధానపరమైన నిర్ణయాన్ని ప్రకటించలేదని వివరించారు. రైతు డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు పని చేస్తామన్నారు. రైతులను తప్పు దోవ పట్టించేందుకుకే మంత్రి కెటిఆర్ ఇలాంటి చీఫ్‌పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు.

రూ.36వేల కోట్లకు ఎందుకు కొంటున్నారు : అద్దంకి దయాకర్

పవర్ ప్లాంట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి అయితే, మరి రూ 36వేల కోట్లకు ఎందుకు కొంటున్నారని టిపిసిసి ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో 12,000 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టులను తయారు చేశామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు 2,000 మెగావాట్ల విద్యుత్‌ను ప్రభుత్వం ఖర్చు పెడుతోందని చెప్పారు. రైతులకు 24 గంటల కరెంట్ వచ్చే ఒక్క గ్రామాన్ని చూపించగలరా? అని కిసాన్ కాంగ్రెస్ చైర్మెన్ సుంకేట అన్వేష్‌రెడ్డి బిఆర్‌ఎస్ నేతలకు సవాల్ విసిరారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ ఉచిత విద్యుత్‌పై కట్టుబడి ఉందని కిసాన్ కాంగ్రెస్ జాతీయ నేత కోదండరెడ్డి స్పష్టం చేశారు.

కాంగ్రెస్సే రేవంత్‌రెడ్డి : ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

కాంగ్రెస్సే రేవంత్ రెడ్డి...రేవంత్‌రెడ్డే కాంగ్రెస్ అని అనడం జోక్ అని ఎంపి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎద్దేవా చేశారు. 'కాంగ్రెస్‌లో పిసిసి నిర్ణయం ఫైనల్ కాదని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ఏం మాట్లాడారో పూర్తిగా నాకు తెలియదన్నారు. సీతక్క సీఎం అనే చర్చ అనవసరమన్నారు. వచ్చే కాంగ్రెస్ ప్రభుత్వంలో 24గంటల ఉచిత విద్యుత్ ఇస్తామంటూ బుధవారం రేవంత్ ప్రకటిస్తారని తెలిపారు. రైతులు బిఆర్‌ఎస్ మాటలు నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. 'కాంగ్రెస్ అంటే రైతులు. రైతులంటే కాంగ్రెస్. దేశంలో రైతులకు అనుకూలంగా పని చేసిన పార్టీ కాంగ్రెస్ ఒక్కటే. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను బిఆర్‌ఎస్ వక్రీకరించింది. మంత్రులంతా నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారు. ఆయన వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారు' అన్నారు.

కల్లు ఘటం సాక బహుజన సాంస్కృతిక వైభవం



- కల్లుగీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ప్రజల సాంస్కృతిక వైభవానికి ప్రతీక బోనాల ఉత్సవమనీ, అందులో కల్లు ఘటం సాక బహుజన సాంస్కృతిక వైభవమని రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవి కుమార్ అన్నారు. మంగళవారం గోల్కొండ కోటలో గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన కల్లు ఘటం సాక కార్యక్రమం గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు అంబాల నారాయణ గౌడ్, కార్య నిర్వాహక అధ్యక్షులు బబ్బురి బిక్షపతి గౌడ్ ఆధ్వర్యంలో జరిగింది. 365 సంవత్సరాల క్రితం సామాన్య కల్లుగీత కుటుంబంలో జన్మించిన సర్దార్ సర్వాయి పాపన్న గోల్కొండ కోటలో కల్లు ఘటం సాక ఏర్పాటు చేసి ఎల్లమ్మకు గుడి కట్టి, సబ్బండ వర్గాలకు సహపంక్తి బోజనలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఆ గొప్ప సంస్కృతితోపాటు ఆయన వారసత్వాన్ని, స్ఫూర్తిగా తీసుకుని కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గత పదేండ్ల నుంచి గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర కమిటీ పర్యవేక్షణలో జరుగుతున్న తీరు అభినందనీయమని అన్నారు, ఈ కార్యక్రమంలో బిసి కమీషన్ సభ్యులు కిషోర్ గౌడ్ , గౌడ సమన్వయ కమిటీ చైర్మన్ బాలగోని బాలరాజు గౌడ్, పల్లే లక్ష్మణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

నడిగడ్డ ప్రాంత సీడ్ రైతులను ఆదుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న నాయకులు

- రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నడిగడ్డ ప్రాంతంలో నష్టపోయిన విత్తన పత్తి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నష్టపోయిన సీడ్ పత్తి రైతుల పొలాలను మంగళవారం గద్వాల జిల్లా మల్దకల్, బిజ్వారం గ్రామాల్లో ఆయన పరిశీలించారు. 30 ఏండ్ల నుంచి ఈ ప్రాంతం రైతులు వాణిజ్య పంటలు సాగు చేస్తున్నారని తెలిపారు. గద్వా ప్రాంతంలోనే 60 వేల ఎకరాల్లో సీడ్ పంటలు వేస్తున్నారని తెలిపారు. 2015-16లో ఎర్రతెగులు సోకి 57 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. పెట్టుబడులు సైతం చేతికి రాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కాస్త పెరిగిన మొక్కలు క్రాసింగ్ చేద్దామన్నా.. సుంకు రాకపోవడంతో రైతులు దిక్కు తోచని స్థితిలో ఉన్నారన్నారు. విపత్తుల నుంచి ప్రభుత్వం రైతాంగాన్ని కాపాడటం లేదన్నారు. విత్తన బంఢాగారంగా చేసేందుకు విత్తన ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తామన్న పాలకుల మాటలు నీటి మూటలుగానే మిగిలిపోయాయని విమర్శించారు. రైతులకు నష్టం వస్తే.. ఈ ప్రాంత ఓట్లతో గెలిచిన నాయకులు కనీసం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విత్తన కంపెనీలతో మాట్లాడి నష్టం ఎంత జరిగిందో అంచనా వేసి రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పంటలకు బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. రైతులకు ఫౌండేషన్ సీడ్ ఉచితంగా ఇచ్చి.. ఎకరాకు రెండు లక్షల రూపాయలు వడ్డీ లేని రుణం ఇవ్వాలని, జిన్నింగ్ ఖర్చులు కంపెనీలే భరించాలని రాతపూర్వక ఒప్పందం చేసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు కంపెనీలకు విత్తనాలు ఇచ్చిన తర్వాత 90 రోజుల్లో డబ్బులు చెల్లించాలని కోరారు. ఆయన వెంట తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు వీవీ నరసింహా, పండు రంగారెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, నాయకులు శివన్న, సీతారాములు, సామేలు, బుచ్చన్న, ప్రభుదాసు, గోపాల్ తదితరులు ఉన్నారు.

హర్‌ఘర్‌జల్‌పై పిఎం సమీక్ష

- 26న ప్రధాని వీడియో కాన్ఫరెన్స్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వ పథకాలు, ప్రాజెక్టుల అమలు తీరు తెన్నులపై ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఈనెల 26న వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమాచారం అందించారు. దీంతో అధికార యంత్రాంగం ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించింది. ఆయా శాఖలకు సంబంధించి సమాచారం తెప్పించుకోవాలని ప్రధాన కార్యదర్శి కార్యాలయం ప్రభుత్వ కార్యదర్శులు, హెచ్ఒడిలకు తెలియజేశారు. దాదాపు మూడు గంటలపాటు ప్రధాని వీడియో కాన్ఫరెన్స్‌లో ఉంటారని తెలిసింది. రాష్ట్రానికి సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో మాట్లాడనున్నారు. రాష్ట్రంలో అమలవుతున్న మిషన్ భగీరథ ప్రాజెక్టును ఆదర్శంగా తీసుకుని దేశవ్యాప్తంగా హర్‌ఘర్‌జల్ పథకాన్ని చేపట్టిన విషయం విదితమే. దాదాపు 16 రాష్ట్రాలకు మిషన్ భగీరథ డీపీఆర్లను పంపి, ఆ తరహా ప్రాజెక్టులను చేపట్టాలని 2019లోనే కేంద్రం సూచించింది. అలాగే భగీరథకు కాపీలా హర్‌ఘర్‌జల్ పథకాన్ని తీసుకొచ్చింది. ఇకపోతే జాతీయ రహదారులకు సంబంధించి సమీక్ష చేయనున్నారు. ఇదిలావుండగా సాగునీటి ప్రాజెక్టులపై మాట్లాడనున్నారు. కాగా రాష్ట్రానికి జాతీయ ప్రాజెక్టును ఇవ్వాలంటూ ఈ సందర్భంగా అడిగే అవకాశాలు ఉన్నాయని సమాచారం. గతంలో మిషన్‌భగీరథకు, కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని అడిగిన సంగతి తెలిసిందే. అలాగే నీతిఆయోగ్ సైతం సిఫారసు చేసింది. అయినా కేంద్రం పెడచెవిన పెట్టింది. ఇదిలావుండగా ప్రధాని వీడియోకాన్ఫరెన్స్ వచ్చే ఎన్నికల ప్రచారానికేనని అంటున్నవారూ లేకపోలేదు. కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అనుకూల కార్యక్రమాలు చేపట్టాలంటూ మార్గదర్శకాలు పంపారనే ప్రచారం జరుగుతున్నది. దీనిపై అధికారులను వివరణ కోరగా స్పందించడానికి నిరాకరించారు.

బిల్డర్లకు బ్రాండ్ అంబాసిడర్‌గా కెటిఆర్ : చింతల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని బిల్డర్లకు మంత్రి కెటిఆర్ బ్రాండ్ అంబాసిడర్‌గా మారారని బిజెపి నేత, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని బిజెపి ఆఫీసులో ఆయన మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం లక్ష కోట్ల రూపాయలు ఖర్చు పెట్టామని మంత్రి కెటిఆర్ చెబుతున్నారనీ, ఎక్కడ అభివృద్ధి జరిగిందని ప్రశ్నించారు. రెండు సెంటిమీటర్ల చిన్న వర్షానికే నాలాలు నిండి రోడ్లపైకి, ఇండ్లలోకి నీరు వస్తున్నాయన్నారు. నగరంలో 20 లక్షల మందికి కూడా తాగు నీరు అందట్లేదని విమర్శించారు. రాష్ట్రంలో కల్వకుంట్ల ట్యాక్స్‌కే 30 శాతం నిధులు పోతున్నాయని ఆరోపించారు. ఇతర రాష్ట్రాల్లోని చిన్న నగరాలు, తక్కువ జనసాంద్రత ఉన్న చోట్ల అధిక బడ్జెట్ కేటాయిస్తున్నారనీ, ఎక్కువ జనసాంద్రత కలిగిన హైదరాబాద్ బడ్జెట్ చాలా తక్కువని చెప్పారు. మెహిదీపట్నం నుంచి బిహెచ్‌ఈఎల్ వరకు మెట్రో ఏమైందని ప్రశ్నించారు. యాదాద్రి వరకు ఎమ్ఎమ్‌టీఎస్ పొడిగిస్తామన్న ఇచ్చిన హామీ ఏమైందని నిలదీశారు. వ్యాపార లావాదేవీలు తప్ప వారికి హైదరాబాద్ అభివృద్ధి పట్టదని విమర్శించారు. ఎన్నికలొస్తేనే హడావిడి చేస్తారనీ, ఆ తర్వాత పూర్తిగా మర్చిపోతారని చెప్పారు. డబుల్ ఇండ్లు, మౌలిక సదుపాయాల కల్పనలో రాష్ట్ర సర్కారు విఫలమైందని విమర్శించారు.

ఓయు ఇంజినీరింగ్‌కు 10 ఏండ్ల స్వయంప్రతిపత్తి

- కలిసొచ్చిన న్యాక్, ఎన్‌బిఎ గుర్తింపు
- శతాబ్ది వైపు శరవేగంగా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మరో నాలుగేండ్లలో శతాబ్ది ఉత్సవాలు చేసుకునే దిశగా అడుగులు వేయబోతుంది. ఈ తరుణంలో అరుదైన ఘనతను అందిపుచ్చుకుంది. పదేండ్లపాటు యుజిసి స్వయం ప్రతిపత్తి హోదాను సాధించింది. 1929లో స్థాపించిన ఈ కళాశాలకు గతంలో రెండుసార్లు ఆరేండ్ల చొప్పున అటానమస్ (స్వయం ప్రతిపత్తి) గుర్తింపు దక్కింది. తాజాగా ఒకేసారి పదేండ్ల గుర్తింపు దక్కించుకుంది. ఈ మేరకు యుజిసి ఉత్తర్వులు జారీ చేసినట్టు ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరాం వెంకటేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓయూకు న్యాక్ ఏ ప్లస్ గుర్తింపు ఉండటం, ఇంజినీరింగ్ కళాశాలలో ఉన్న అన్ని విభాగాలకు "నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్" (ఎన్‌బిఎ) గుర్తింపు సాధించటం లాంటి అంశాలను యుజిసి పరిగణనలోకి తీసుకోవడం కలిసి వచ్చిందని ప్రిన్సిపల్ తెలిపారు.

సందర్శించకుండానే గుర్తింపు.. ఇది తొలిసారి

ఇంజినీరింగ్ కళాశాలలను యుజిసి టీమ్స్ సందర్శించకుండానే గుర్తింపు ఇవ్వడం ఒకెత్తు అయితే.. పదేండ్ల పాటు స్వయం ప్రతిపత్తి హోదా కల్పిస్తూ నిర్ణయం తీసుకోవడం మరొక ఎత్తు. స్వయం ప్రతిపత్తికి కావాల్సిన డాక్యుమెంట్స్ (అర్హత పత్రాలు), ఆన్‌లైన్ ద్వారా చేరవేయడంతో పరిశీలించి గుర్తింపు ఇచ్చినట్టు అధ్యాపకులు తెలిపారు. ఫలితంగా 2022-23 నుంచి 2031-32 వరకు స్వయం ప్రతిపత్తి అమల్లో ఉంటుంది. ఇంత సుదీర్ఘ కాలం అటానమస్ హోదా కలిగిన కళాశాలలు దేశంలోనే అతి స్వల్పమని కళాశాల అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

ఇక స్వచ్ఛతో ముందుకు

తమ కళాశాలకు దక్కిన ఈ హోదాతో కోర్సులు, సిలబస్ రూపకల్పన అంశాల్లో స్వేచ్ఛ ఉంటుందని, పరిశోధన ప్రాజెక్టుల్లోనూ ప్రాధాన్యత ఉంటుందని ప్రొ. శ్రీరాం వెంకటేశ్ అన్నారు. కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు పనులు ప్రారంభించడంతోపాటు ఆధునిక కోర్సులు అందుబాటులోకి తీసుకొచ్చామని ఓయూ వీసీ ప్రొ.రవిందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ తెలిపారు. స్వయం ప్రతిపత్తి హోదా దక్కడం కళాశాల అధ్యాపకుల, ఉద్యోగుల సమిష్టి కృషి అన్నారు.

సాధించిన ఘనత, గుర్తింపులు

2021-2022లో 9 పీజీ కోర్సులకు, 6 యూజీ కోర్సులకు 2025 వరకు ఎన్‌బీఎ అక్రిడిటేషన్ జారీ అయింది. నాణ్యమైన విద్యా సేవాలు, వసతి గృహాల, కార్యాలయ నిర్వహణలు, సజావుగా పరీక్షల నిర్వహణ, సకాలంలో ఫలితాల జారీ, విద్యార్థుల భద్రత, క్యాంటీన్ ద్వారా నాణ్యమైన ఆహారం ఇవ్వన్నీ పరిగణనలోకి తీసుకుని ఇంటర్నేషనల్ స్టాండెడ్స్ ఆర్గనైజేషన్ (ఐఎస్‌ఓ), 9001 : 2015, 14001-2015, 50001-2018 గుర్తింపు పొందింది. ఓయూ మైనింగ్ ఇంజినీరింగ్ విభాగం రెండు అరుదైన "చైర్స్" 6 నెలల వ్యవధిలో వంశం చేసుకుంది. ఈసీఈ విభాగంలో "ఇన్ టెక్"ను 50 నుంచి 60 వరకు, బీఎంఈ ఇన్ టెక్‌ను 30 నుంచి 40 వరకు పెంపొందించారు.

శతాబ్ది సందర్భంగా చేపడుతున్న కార్యక్రమాలు

రూ.38 కోట్లతో అబ్బాయిలకు 500 బెడ్స్ సామర్థ్యంతో కిన్నెర వసతి గృహం నిర్మాణంలో ఉంది. రూ.2 కోట్లతో ఈసీఈ క్లాస్ రూమ్ కాంప్లెక్స్ నిర్మాణం జరుగుతోంది. విద్యార్థుల అన్ని రకాల సర్టిఫికేట్స్‌ను డిజిటల్ లాకర్‌లో ఉంచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఐడీపీ విజన్ డాక్యుమెంట్స్‌ను 2029 వరకు సన్నద్ధం చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. రూ.24 కోట్లతో సీఎస్ఈ, మైనింగ్, ఎలక్ట్రికల్ విభాగాలకు అల్యూమినీ, కళాశాల నిధులతో క్లాస్ రూమ్ కాంప్లెక్స్ నిర్మాణం చేయ నున్నారు. రూ.2 కోట్లతో నూతన క్యాంటీన్ నిర్మాణం. అమ్మాయిల వసతి గృహంలో జిమ్ ఏర్పాటు. వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం రానున్న విద్యా సంవత్సరం నుంచి అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సులు నిర్వహించనున్నారు